క్లుప్తంగా

సమీకృత మార్కెట్ నిర్మాణానికి స్థల పరిశీలన

కథలాపూర్: చింతకుంట, కథలాపూర్ గ్రామాల్లో సమీకృత మార్కెట్ నిర్మాణానికి అవసరమైన స్థలాల కోసం తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, ఎంపీడీవో జనార్దన్ గురువారం పరిశీలించారు. కథలాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ప్రభుత్వ స్థలం అనువుగా ఉందని అధికారులు పేర్కొన్నారు. ఏపీవో రాజేందర్, ఈసీ లక్ష్మయ్య, ఆర్‌ఐ నాగేశ్, టీఏ అంబాజి ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జాబితాపూర్ సర్పంచ్

జగిత్యాలరూరల్: జాబితాపూర్ సర్పంచ్ అంకం మమతను ఇటీవల జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా సస్పెండ్ చేశారు. ఆమె హైకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు ఆదేశాల మేరకు అంకం మమత సస్పెన్షన్‌ను నిలుపుదల చేస్తూ గురువారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మమత సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు.

మహబూబ్ అలీ వర్ధంతి



కథలాపూర్: సిరికొండలో కార్మిక సంఘం నేత మహబూబ్ అలీ వర్ధంతి వేడుకలను నాయకులు గురువారం నిర్వహించారు. అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్మికుల సంక్షేమం కోసం అలీ చేసిన సేవలను కొనియాడారు. బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సుతారి రాములు, నాయకులు వడ్ల బాగమ్మ, వెన్నం రాధ, చెన్నవేని దశరథం, కర్నె భూమయ్య, సోమ భూమరెడ్డి, ఆకుల లక్ష్మి, చాంద్‌పాషా, ఎండీ సమీర్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



రాయికల్: బోర్నపల్లి గ్రామానికి చెందిన తొడసం జైతు అనే దివ్యాంగుడికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.లక్ష ప్రొసీడింగ్ కాపీని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గురువారం అందజేశారు. అనంతరం చెలుకగూడెంలో జంగుబాయి దేవున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, కోల శ్రీనివాస్, సర్పంచ్ పాదం లత, ఎంపీటీసీ పెంద్రం కవిత పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుటుంబానికి అండగా ఉంటాం



మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రవిశంకర్

మల్యాల: పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తామని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంగ మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. గురువారం సాయంత్రం రవిశంకర్ డైరెక్టర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, పాక్స్ చైర్మన్లు అయిల్నేని సాగర్‌రావు, ముత్యాల రాంలింగారెడ్డి, పాక్స్ డైరెక్టర్ కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ అజారొద్దీన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆసం శివ పాల్గొన్నారు.

పాత్రికేయుల సంక్షేమానికి కృషి



రాయికల్: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం రాయికల్ పట్టణంలోని వర్తక సంఘ భవనంలో మండల ప్రెస్‌క్లబ్ జేఏసీ నూతన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాయికల్ ప్రెస్‌క్లబ్ భవనానికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. సీనియర్ పాత్రికేయుడు ధర్మపురి ఇటీవల మృతిచెందగా.. జేఏసీ తరఫున ఎమ్మెల్యే చేతుల మీదుగా రూ.31,500 చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, జగిత్యాల జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి ప్రదీప్, మున్సిపల్ వైస్ చైర్మన్ రమాదేవి, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, ప్రెస్‌క్లబ్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మెట్‌పల్లి: పట్టణంలోని సూర్యోదయ హైస్కూల్‌లో గురువారం కల్చరల్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. బహుమతులను అందించారు.

ధాన్యం సేకరణ.. రూ.25కోట్ల వ్యాపారం

- కథలాపూర్ మండల మహిళా సంఘాలకు రూ.37లక్షల కమీషన్



కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం పరిశీలిస్తున్న అధికారులు, మహిళలు(ఫైల్‌ఫొటో)

కథలాపూర్: రైతులు పండించిన ధాన్యం విక్రయించడానికి ఇబ్బందులు ఉండొద్దని గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫలితంగా రైతులకు దళారుల బెడద తగ్గి ధాన్యానికి మద్దతు ధర రాగా.. కొనుగోలు కేంద్రాలు నిర్వహించిన మహిళలకు కమీషన్ డబ్బులు రావడంతో వారికి ఆర్థికంగా భరోసా ఇచ్చినట్లయింది. ఇలా కథలాపూర్ మండలంలోని మహిళలు వానకాలం సీజన్‌కు సంబంధించి రూ.25.58కోట్ల వ్యాపారం చేసి అధికారుల మెప్పు పొందారు.

1,16,124 క్వింటాళ్ల సేకరణ

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా.. సెర్ప్ ఆధ్వర్యంలో అంబారిపేట, బొమ్మెన, భూషణరావుపేట, చింతకుంట, దూలూర్, కథలాపూర్, పెగ్గెర్ల, పోతారం, సిరికొండ, తక్కళ్లపెల్లి, తాండ్ర్యాల గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన 1,16,124 క్వింటాళ్ల ధాన్యాన్ని మహిళలు కొనుగోలు చేశారు. క్వింటాలుకు రూ.2,203 చొప్పున మొత్తం రూ.25,58,21,172 చెల్లించారు. కొనుగోలు కేంద్రాలు నిర్వహించినందుకు గాను మహిళలకు క్వింటాలుకు కమీషన్ రూపంలో రూ.32 ప్రభుత్వం చెల్లించింది. ఇలా మండలంలో కొనుగోలు కేంద్రాలు నిర్వహించిన మహిళా సంఘాలకు గాను రూ.37,15,968 కమీషన్ వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. రైతులకు సహకారం.. మహిళలకు వ్యాపారం కలిసి వచ్చినట్లయిందని అధికారులు అంటున్నారు.

నెల రోజులు శ్రమించాం



గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు సమాచారం ఇచ్చారు. అందుకు సంబంధించి మహిళలకు కొనుగోలు కేంద్రాల నిర్వహణపై మండల కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. నిబంధనల మేరకు కొనుగోలు చేశాం. తేమ శాతం పరిశీలించడం, తూకం వేయించడం, రైస్‌మిల్‌కు ధాన్యం తరలించి రైతులకు డబ్బులు చెల్లించే వరకు బాధ్యతలు నిర్వర్తించాం. నెల రోజుల పాటు శ్రమించి కొనుగోలు కేంద్రాలను విజయవంతంగా పూర్తి చేయడం సంతోషంగా ఉంది.

– లక్ష్మి, మహిళా సంఘాల ప్రతినిధి

అందరి సహకారంతో విజయవంతం



గ్రామాల్లో ధాన్యం విక్రయాలకు దళారుల బెడద ఉండొద్దని ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. వరి కొనుగోలు కేంద్రాల నిర్వహణకు మహిళలతో పాటు రైతులు సహకరించడంతో విజయవంతమైంది. మండలంలో 11 కేంద్రాలు ఏర్పాటు చేయడంతో మహిళలకు ఉపాధి లభించినట్లయింది. సంఘాలకు గాను రూ.37లక్షల కమీషన్ వచ్చింది.

– నరహరి, సెర్ప్ ఏపీఎం, కథలాపూర్

సంక్షిప్త వార్తలు

టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా శివకృష్ణ



ఇబ్రహీంపట్నం: టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా వర్షకొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న దస్తారి శివకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి తులసి ఆగమయ్య గురువారం తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా తుంగూరి జగన్‌మోహన్, ఉపాధ్యక్షులుగా ఎస్.మమత, టి.వేణు, కోశాధికారిగా ఇమ్మానుయేల్, కార్యదర్శులుగా మురళి, ఇఫ్సాత్ యాస్మిన్, రజిత, గంగమణి, భాగ్యలక్ష్మి, ఆడిట్ కన్వీనర్‌గా ఎం.నవీన్, ఆడిట్ సభ్యులుగా పి.రమేశ్, ఎండీ ఇబ్రహీం, సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి గాదే శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ బీఎల్‌వోగా స్వప్న

మల్యాల: మండల ఉత్తమ బూత్ లెవల్ అధికారిగా అంగన్వాడీ టీచర్ స్వప్న ఎంపికయ్యారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వప్నను కరీంనగర్ అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ శాలువాతో సన్మానించారు. స్వప్న గతంలో రెండుసార్లు ఉత్తమ అంగన్వాడీ టీచర్‌గా ఎంపికయ్యారు. ఎంపీపీ మిట్టపల్లి విమల, సర్పంచ్ తదితరులు అభినందించారు.

కార్యవర్గం ఎన్నిక

ధర్మపురి: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం మండల పద్మశాలీ ప్రొఫెషనల్ అండ్ అఫీషియల్ అసోసియేషన్(పోపా) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా పోపా ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేశ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా వెలుగందుల సత్యనారాయణ, అధ్యక్షుడిగా మ్యాన పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కస్తూరి శరత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా అసం శ్రీనివాస్, వెలుగందుల శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా తన్నీరు సురేష్, కస్తూరి ప్రవీణ్ తదితరులు ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్ భోగ శివప్రసాద్, కార్యవర్గ సభ్యులు తదితరులున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కథలాపూర్: ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు చేశారు. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి రక్తస్థాయి ఏవిధంగా ఉందనేది తెలుసుకున్నారు. ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి సురేంద్ర, ఎస్‌ఎంసీ చైర్మన్ అంగరి ప్రేమ్‌సాగర్, హెచ్‌ఎం రాజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: విష జ్వరాలు ప్రబలకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి, పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ వాహిని అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన వైద్యశిబిరంలో విద్యార్థినులకు ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. 122 మందికి పరీక్షలు నిర్వహించి 36 మందికి మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఇందిర, ల్యాబ్ టెక్నీషియన్ ఉమాదేవి, స్టాఫ్‌నర్స్ సుమ, ఏఎన్‌ఎం అంజమ్మ, ఎస్టీ మినీ గురుకుల బాలికల పాఠశాల హెచ్‌ఎం సుమలత పాల్గొన్నారు.

జీవో నెంబర్ 55ను వెనక్కి తీసుకోవాలి



జగిత్యాల: ఆందోళన చేస్తున్న నాయకులు

జగిత్యాల: జీవో నెంబర్ 55ను వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. అగ్రికల్చర్ యూనివర్సిటీలో హైకోర్టు భవనాలు కట్టడం అంటే వ్యవసాయ రంగాన్ని తుంగలో తొక్కినట్లేనన్నారు. శ్రీనివాస్, మనోహర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉద్యాన వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 55ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని కార్గిల్ చౌరస్తా వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని పోలీసులు బైక్‌పై వెళ్తూ జుట్టు పట్టి క్రూరంగా లాక్కెళ్లటం అమానవీయ చర్య అని అన్నారు.

మెట్‌పల్లి: హైదరాబాద్‌లో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో ఏబీవీపీ నాయకులు ఆందోళన చేశారు. నగర కార్యదర్శి కాసిపాక అరవింద్, అభి వెంకట్, జయంత్, నిఖిలేష్, భవేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా మూల మంత్ర హవనము



పూజల్లో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లి: పట్టణంలోని కోదండ రామాలయంలో గురువారం విష్ణు సహస్రనామ సహిత లలిత సహస్రనామ మూల మంత్ర హవనము కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ముందుగా గణపతి, శ్రీచకార్చన పూజలు జరిపారు. ఆ తర్వాత 27 కుండములు ఏర్పాటు చేసి 108 జంటలతో హవనము చేశారు. సాయంత్రం భగవద్గీత పారాయణం జరిపారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

చీరలు పంపిణీ

జగిత్యాల: గురు పౌర్ణమిని పురస్కరించుకొని సాయిబాబా ఆలయ సమీపంలో స్వచ్ఛంద సభ్యులు యాచకులకు చీరలు పంపిణీ చేశారు. ప్రతి పౌర్ణమికి సేవా దృక్పథంతో యాచకులకు చీరలు పంపిణీ చేస్తామన్నారు. వైస్ చైర్మన్ నాగుల కిషన్‌గౌడ్, పురుషోత్తంరావు, కళాశ్రీ అధినేత గుండేటి రాజు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



కథలాపూర్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం పుష్య పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో హిందూ ధర్మ ప్రచార సమితి జిల్లా ప్రేరక్ మంచాల జగన్, మండల ప్రేరక్ బచ్చు కిషన్, ఆలయ కమిటీ ప్రతినిధులు కిషన్‌రెడ్డి, రాజేందర్‌రావు, శాంతరాం, అర్చకుడు రామకృష్ణచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ ఓటరు దినోత్సవం



మెట్‌పల్లిరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది





వెల్గటూర్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ శేఖర్, మల్యాలలో ర్యాలీ

మెట్‌పల్లిరూరల్: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో భీమేష్‌రెడ్డి, ఎంపీవో మహేశ్వర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయికల్‌లో..

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో నిర్వహించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించి ఓటు హక్కు ప్రాధాన్యం గురించి అవగాహన కల్పించారు. తహసీల్దార్ ఖయ్యూం, కమిషనర్ గంగుల సంతోష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, పొన్నం రమేశ్, రవీందర్, జమున, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌లో..

వెల్గటూర్: వెల్గటూర్ జెడ్పీ హైస్కూల్‌లో తహసీల్దార్ శేఖర్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ మేరుగు మురళిగౌడ్, తహసీల్ కార్యాలయ సిబ్బంది, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఓటు హక్కు చాలా విలువైనది

సారంగాపూర్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైందని సారంగాపూర్ తహసీల్దార్ రమేశ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేణు అన్నారు. సారంగాపూర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, రెవెన్యూ అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఆయా శాఖల సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఆర్‌ఐలు భాస్కర్‌రావు, కృష్ణ, హెచ్‌ఎం కిషోర్ తదితరులున్నారు. బీర్‌పూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ నరేష్, ఆర్‌ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రాయుధం

మల్యాల: ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధమని, ప్రజా సంక్షేమం కోసం ఓటు హక్కు వినియోగించడం అందరి బాధ్యతగా గుర్తించాలని తహసీల్దార్ మునీందర్ అన్నారు. వివిధ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ మునీందర్ ర్యాలీలో పాల్గొని ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్, ఆర్‌ఐ తిరుపతి, కార్యదర్శి రవీందర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెగడపల్లిలో..

పెగడపల్లి: ప్రజాస్వామ్యంలో ఓటు విలువ వెలకట్టలేనిదని, అది ఒక వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ ఎంఏ ఫరూక్, ఎంపీడీవో పుల్లయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో తహసీల్ కార్యాలయం ఎదుట వివిధ శాఖల సిబ్బంది, ఓటర్లతో ప్రతిజ్ఞ చేశారు. ఎంపీవో మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ విష్ణువర్ధన్, ఆర్‌ఐలు శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలో తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, ప్రిన్సిపాల్ గౌసుర్ రహమాన్, ఆర్‌ఐ నాగేశ్, సర్పంచ్ నీరజ, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటుదే కీలక పాత్ర

మల్లాపూర్: ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రజలందరి ఆయుధమైన ఓటుదే కీలక పాత్ర అని తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీవో జగదీష్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటేస్తాం

ఇబ్రహీంపట్నం: ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటేస్తామని తహసీల్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ప్రసాద్‌తో పాటు సిబ్బంది, మోడల్ స్కూల్ కళాశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్‌ఐలు రమేశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. కళాశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మస్రూమ్‌సుల్తానా, పడాల తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్మపురి: తహసీల్దార్ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, మండల, రెవెన్యూ శాఖ అధికారులు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

నమోదు చేసుకోవాలి

బుగ్గారం: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మాజిద్ అన్నారు. మండల కేంద్రంలో స్థానిక పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో తిరుపతి, నగునూరి రామకృష్ణ పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ నాయకులు



జగిత్యాలరూరల్: హైదరాబాద్ వెళ్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే పార్లమెంట్ కమిటీ సమావేశాలకు జగిత్యాల రూరల్ మండలం, అర్బన్ మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో పాటు బూత్ లెవల్ కమిటీ సభ్యులు హైదరాబాద్ తరలివెళ్లారు. రెండు మండలాల్లోని ప్రతి ఎన్నికల బూత్ నుంచి 4 నుంచి 5 చొప్పున ప్రతినిధులు వెళ్లారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అధ్యక్షతన బస్సుల్లో బయలుదేరారు.

రాయికల్ నుంచి..

రాయికల్: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశానికి రాయికల్‌కు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు తరలివెళ్లారు. పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, నాయకులు దిలీప్, షాకీర్, మహిపాల్‌రెడ్డి, పొన్నం శ్రీకాంత్, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కోరుట్ల నుంచి..

కోరుట్లరూరల్: కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ బూత్ లెవల్ సభ్యులు, నాయకులు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో కాంగ్రెస్ సమావేశానికి తరలివెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో 5 బస్సుల్లో వెళ్లారు. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల అధ్యక్షులు తిరుమల గంగాధర్‌గౌడ్, జెట్టి లింగం తదితరులు పాల్గొన్నారు.


డాక్టరేట్ సాధించడం అభినందనీయం



ఉదయ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మల్లాపూర్: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలోసఫీ(పీహెచ్‌డీ) పూర్తి చేసిన ఉపాధ్యాయుడు చింతకింది ఉదయ్(బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్) డాక్టరేట్‌ను పొందడం అభినందనీయమని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మన్న అన్నారు. గురువారం మొగిలిపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఉదయ్‌ను ఉపాధ్యాయ బృందంతో కలిసి సన్మానించి అభినందించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి ఆనందరావు, మండల అధ్యక్షుడు ఎనుగందుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జక్కుల నవీన్‌కుమార్ అభినందించారు. మొగిలిపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జంగ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో నమో నవ్‌మత్ దాత



కోరుట్ల: పట్టణంలోని అరుణోదయ డిగ్రీ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో నమో నవ్‌మత్ దాత సమ్మేళనం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు కలాల సాయిచంద్ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లు క్యూ ఆఫ్ కోడ్‌ను స్కాన్ చేసి 7820028200 ఫోన్ నెంబర్‌కు మిస్ కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కొత్త ఓటర్లందరూ తమ మిస్ కాల్ ద్వారా ప్రధానికి మద్దతు తెలపాలన్నారు. వెంకటేష్, పీసరి నర్సయ్య, గణేశ్, సుదవేణి మహేశ్ పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

కోరుట్ల: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ గురువారం పంచాయతీరాజ్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న పనుల వివరాలు, పురోగతిని తెలుసుకున్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

జగిత్యాల: అంతర్గాం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.50లక్షల నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్గాం గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరిందని, పంచాయతీ భవనాలు వినియోగానికి అనువుగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నుంచి రూ.50లక్షల నిధులు మంజూరు చేయాలని అన్నారు.

30న డివిజన్‌స్థాయి ప్రతిభ పరీక్ష

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 30న డివిజన్ స్థాయిలో పదోతరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. పదోతరగతి పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్, అర్థమెటిక్, రీజనింగ్ అంశాలుంటాయన్నారు. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభమవుతోందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా హాజరు కావాలని సూచించారు.

పాఠశాలకు దాతల సహకారం



ధర్మపురి: దోనూర్ ప్రభుత్వ పాఠశాలకు ధర్మపురికి చెందిన మధు మహతి విశ్వనాథ్ తమ తల్లిదండ్రులు నారంభట్ల రాజేశ్వరి, మధుసూదన్ జ్ఞాపకార్థంగా రూ.20వేల విలువ గల సౌండ్ సిస్టమ్ బహూకరించారు. గ్రామానికి చెందిన స్థానిక నాయకుడు సంగ నర్సింహులు పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ కోసం రూ.8వేలు నగదును విరాళంగా అందజేశారు.

మెరుగైన విద్యనందించాలి

జగిత్యాల: విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం డీఈవో కార్యాలయంలో టీఎస్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరించారు. నాయకులు రాజిరెడ్డి, పరమేశ్వర్, మామిడాల శ్రీనివాస్‌రెడ్డి, పోచంపల్లి కొమురయ్య పాల్గొన్నారు.

భీంరాజ్‌పల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

గొల్లపల్లి: భీంరాజ్‌పల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను వివిధ శాఖల అధికారులు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 320 పథకాలను గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు తెలియజేసేందుకు ప్రధాని ప్రారంభించారన్నారు. పంచాయతీ కార్యదర్శి శైలజ, వికసిత్ భారత్ అంబాసిడర్ ఈర్తి మధుకర్, అధికారులు, బీజేపీ నాయకులు చిలువేరి సత్యం, శ్రావణ్ పాల్గొన్నారు.

బెస్ట్ అంబాసిడర్ అవార్డు అందుకున్న మాధవి



మెట్‌పల్లి: హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో గురువారం ఎన్నికల కమిషన్ నిర్వహించిన నేషనల్ ఓటర్స్ డే కార్యక్రమంలో పట్టణానికి చెందిన మామిడాల మాధవి బెస్ట్ అంబాసిడర్ అవార్డును అందుకున్నారు. స్థానిక సాహితీ డిగ్రీ కళాశాల అంబాసిడర్‌గా ఆమె వ్యవహరించారు. ప్రిన్సిపాల్ చంద్రప్రకాశ్, ఉపన్యాసకులు అభినందించారు.